క్లుప్తంగా

సుదర్శన హోమం



వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రవణా నక్షత్రం పురస్కరించుకుని జువ్వలపాలెం రోడ్డులో వేంచేసి యున్న శ్రీవేంకటేశ్వరస్వామివారికి ఆదివారం శాంతి కల్యాణం నిర్వహించారు. మిథున సంక్రమణం పురస్కరించుకుని శ్రీవారికి సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. ఏర్పాట్లను ధర్మకర్త మంతెన రామ్‌కుమార్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు పర్యవేక్షించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సైబర్ నేరాలపై అవగాహన



కాళ్లకూరులో అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

కాళ్ల: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కాళ్ల ఎస్సై ఎస్. శ్రీనివాసరావు అన్నారు. కాళ్ళకూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం గ్రామస్తులకు దొంగతనాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మవద్దన్నారు. స్మార్ట్ ఫోన్లలో తెలియని యాప్, మెసెజ్‌ల లింక్‌లపై టచ్ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడ్డాల శివరామరాజు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీఎన్నార్ క్రీడా మైదానంలో యోగాంధ్ర



డీఎన్నార్ క్రీడా మైదానంలో యోగాసనాలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా డీఎన్నార్ వాకర్స్ అసోసియేషన్, డీఎన్నార్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం డీఎన్నార్ కళాశాల క్రీడా మైదానంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ రోజూ ఒక అరగంట యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు శారీరకంగా బలపడి దైనందిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనవచ్చని కళాశాల అసిస్టెంట్ సెక్రటరీ ఆర్.రామకృష్ణంరాజు అన్నారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.పల్లారావు, కార్యదర్శి పి.సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

ఉండి: లారీ డ్రైవర్‌పై దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెం మండలం నవాబ్‌పాలెంకు చెందిన లారీ డ్రైవర్ కళ్యాణ చక్రవర్తి ఉండి మండలం అర్తమూరు నుంచి చెరుకువాడ మీదుగా భీమవరం లారీలో వెళ్తున్నాడు. చెరుకువాడ రాగానే సత్యమూర్తి అనే వ్యక్తి వేరే వ్యక్తితో గొడవపడుతున్నాడు. ఈ గొడవలో భాగంగా సత్యమూర్తి ఇటుకరాయితో రహదారి పక్కన ఆగి వున్న లారీ అద్దాలు బద్దలు కొట్టి లారీ క్యాబిన్‌లో ప్రవేశించి డ్రైవర్‌ను కొట్టాడు. దీనిపై లారీ డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో హెడ్‌కానిస్టేబుల్ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆకివీడు: కారు ఢీకొని ముగ్గురికి గాయాలైన ఘటన జాతీయరహదారిపై స్థానిక శాంతి ఇన్ హాలు సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి కైకలూరు వైపు వెళుతున్న కారు నడిచివెళుతున్న ఇద్దరు మహిళల్ని ఢీకొట్టి అనంతరం ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దేవరపు నాగ సావిత్రి, కొమ్ము దుర్గారావు, జక్కంపూడి ఫణికుమారిలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్ ఆవుల శివను అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్సై సత్యనారాయణ తెలిపారు. కారు డ్రైవర్ మద్యం మత్తులో కారు నడుపుతుండడం వలన ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని చెప్పారు.

9 మంది జూదరుల అరెస్ట్

భీమవరం: భీమవరం ఒకటో పట్టణంలోని నర్సయ్య అగ్రహారంలో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9 మంది జూదరులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.25,600 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎం. నాగరాజు తెలిపారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం సాగేదెలా?

- గోతులమయంగా తోలేరు, మడుగు పోలవరం రోడ్లు
- అవస్థలు పడుతున్న గ్రామస్తులు, వాహనదారులు



మడుగు పోలవరంలో గోతులమయంగా ఉన్న రహదారి



తోలేరులో అధ్వానంగా రోడ్డు

వీరవాసరం: అధికారంలోకి రాగానే రహదారులకు మహర్దశ ఏర్పడుతుందని కూటమి నాయకులు పెద్ద ఎత్తున ప్రచార ఆర్భాటం చేశారు. ఆ మాయ మాటలు నమ్మి ప్రజలంతా కూటమికి అధికారాన్ని అప్పజెప్పారు. తీరా అధికారం చేజిక్కించుకున్నాక రహదారులకు మహర్దశ మాట దేవుడెరుగు కనీసం గుంతలు పూడ్చే కార్యక్రమం కూడా చేపట్టలేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొణితివాడ గ్రామం నుంచి మడుగు పోలవరం మీదుగా నెలమూరు వెళ్లే రహదారి పూర్తిగా గోతులమయంగా తయారైంది. అదే మాదిరిగా తోలేరు చింత నుంచి తోలేరు- పడమటిపాలెం వెళ్లే రహదారి సైతం పెద్దపెద్ద గుంటలతో కొద్దిపాటి వర్షానికి నీళ్లతో మునిగిపోతుంది. నౌదూరు జంక్షన్ నుంచి అండలూరు మీదుగా వేంద్ర వెళ్లే రహదారి సైతం పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారులపై ప్రయాణం చేయాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఇంతవరకు గోతుల్లో కనీసం తట్ట మట్టి వేసిన దాఖలాలు లేవని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహన చోదకులు, ప్రయాణికులు రహదారిపై ఏర్పడిన పెద్దపెద్ద గుంతల్లో పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. వర్షాలు పడిన సమయంలో అయితే మరీ ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గుంతల్లో నీరు నిండి రహదారి పరిస్థితి తెలియక ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఈ రహదారులను పునర్నిర్మించాలని కోరుతున్నారు.

గోతులను పూడ్చాలి



కూటమి ప్రభుత్వం రహదారి నిర్మాణాలపై పూర్తిస్థాయిలో శ్రద్ధ వహించడం లేదు. ఏ రోడ్డు చూసినా గోతులమయంగానే మారిపోయింది. కొణితివాడ నుంచి మడుగు పోలవరం వెళ్లాలంటేనే భయానక వాతావరణం కనిపిస్తోంది. కొద్దిపాటి వర్షానికి నీళ్లు నిండి రహదారి చెరువులను తలపిస్తుంది. రహదారి నిర్మాణంపై ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం గోతులైన పూడ్చితే బాగుంటుంది.

– కాండ్రేగుల శ్రీనివాసు, నరసన్నచెరువుపాలెం

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



శిక్షణ పొందిన వారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి వేసవి శిక్షణ శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని ప్రముఖ పారిశ్రామిక వేత్త సంజీవ్ సోని అన్నారు. భీమవరం ఎస్ సీహెచ్ బీఆర్ఎం హైస్కూల్లో జరుగుతున్న రోప్ స్కిప్పింగ్, మల్లఖంబ్, కరాటే, రైఫిల్ షూటింగ్ వంటి శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. శిక్షణ పొందిన 40 మందికి ప్రశంసాపత్రాలను అందించారు. సంజీవ్ సోని మాట్లాడుతూ వేసవి సెలవులు వృథా కాకుండా విద్యార్థులు వారికి నచ్చిన అంశాలలో శిక్షణ పొంది మానసిక, శారీరక పరిపక్వతకు పునాదులు వేసుకోవడం గొప్ప విషయమని అన్నారు. ఏపీ రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ రాష్ట్ర సభ్యుడు జీపీసీ శేఖర్ రాజు, కరాటే హోల్డర్, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, పూర్ణిమ సోని, పి.రామభద్రిరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ విశ్వాసుల నిరసన



గొల్లవానితిప్పలో ఆర్‌సీఎమ్ చర్చి వద్ద ఫాదర్ గో బ్యాక్ అంటూ క్రైస్తవ విశ్వాసుల నిరసన

భీమవరం అర్బన్: గొల్లవానితిప్ప గ్రామంలో ఆర్‌సీఎమ్ చర్చి వద్ద ఫాదర్ గో బ్యాక్ అంటూ క్రైస్తవ విశ్వాసులు ఆదివారం నిరసన తెలిపారు. పలువురు సంఘ పెద్దలు మందా జాన్, మిరిపే విజయకుమార్, ముస్కూటి కుటుంబరావు, తాతపూడి రాంబాబు మాట్లాడుతూ 2021లో ఆర్‌సీఎమ్ చర్చికి ఫాదర్ జోషఫ్, రాజ్‌కుమార్ సేవ చేసేందుకు వచ్చారని అప్పటి నుంచి చర్చి పరిధిలో ఉన్న విచారణ సంఘాలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. గత కొంతకాలంలో చర్చిలో నూతనంగా వివాహం చేసుకున్న వారికి డిక్లరేషన్ ఇవ్వాలని నగదు కూడా అడగి కొత్త నిబంధనలు తీసుకువస్తున్నారన్నారు. అంతేకాకుండా తమపై అన్యాయంగా, అక్రమంగా కేసులు పెట్టారని ఆరోపించారు. సంఘ పెద్దలకు మద్దతుగా మాజీ సర్పంచ్ బోకూరి విజయరాజు వెళ్లడంతో ఆయనపై కేసు పెట్టినట్లు ఆయన తెలిపారు. రూరల్ పోలీసులు ఉద్రిక్తత జరగకుండా పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి

పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చినిమిల్లి వెంకట్రాయుడు



రాయలం క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతున్న చినిమిల్లి

భీమవరం అర్బన్: గ్రామ స్థాయి నుంచి వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చినిమిల్లి వెంకట్రాయుడు అన్నారు. మండలంలోని రాయలం గ్రామంలో ఆదివారం చినిమిల్లిని ఎల్‌వీఎన్‌పురం పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చినిమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను ఐదేళ్లలో 99 శాతం పైగా అమలు చేశారని, సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతి ఒక్కరి మదిలో జగన్ ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఏకం కావాలన్నారు. అనంతరం పలు అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ గాదిరాజు రామరాజు, కోడే యుగంధర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, సర్పంచ్ కేతా నాగబాబు, ఎంపీటీసీ వీరవల్లి శ్రీనివాస్, ఉప సర్పంచ్ అల్లూరి రవికుమార్ రాజు, మాజీ సర్పంచ్ కుడిపుడి సత్యనారాయణ, ఇళ్ల రాంబాబు, కండిబోయిన బాబురావు, వీరవల్లి శ్రీను, పెచ్చెట్టి శ్రీనివాసరావు, కొల్లి శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌లలో మహిళలకు అధిక ప్రాధాన్యత



క్లబ్ నూతన కమిటీ అధ్యక్షులకు దండన అందజేస్తున్న జిల్లా మాజీ గవర్నర్ సూర్యనారాయణరాజు

ఆకివీడు: లయన్స్ క్లబ్‌లలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, క్లబ్ అధ్యక్షులుగా మహిళల్ని నియమించి వారి ద్వారా సేవాకార్యక్రమాల్ని విస్తృతం చేయాలని లయన్స్ జిల్లా గవర్నర్ ఎన్‌వీపీ. ఎస్.పాపారావు నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ఆదర్శ లయన్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవం లయన్స్ ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షులుగా కేవీఎస్.పూర్ణచంద్రశేఖర్, కార్యదర్శి, కోశాధికారి, కార్యవర్గ ప్రతినిధులతో లయన్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ ఎంవీ.సూర్యనారాయణరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లా రెండవ గవర్నర్ ఆర్వీ.ఎస్. సూర్యనారాయణరాజు, వీవీ కృష్ణంరాజు, పేర్ని సుబ్రహ్మణ్యం, గొంట్లా కృష్ణ, లయోక్లబ్ అధ్యక్షులు ఎస్.హర్ష, మోటుపల్లి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫాదర్స్ డే



భీమవరం: సీనియర్ సిటిజన్స్‌ను సత్కరిస్తున్న దృశ్యం



ఉండి: ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ చర్చ్‌లో తండ్రులను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం ఆర్యవైశ్య యువజన సంఘం నందు ఆదివారం ఫాదర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో విశిష్ట సేవలందిస్తున్న తండ్రులకు సత్కారాలు నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ తండ్రి పిల్లలకు మార్గదర్శకంగా ఉండాలని, అప్పుడే సమాజానికి ఉత్తమ పౌరులను అందించగలరని అన్నారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వబిలిశెట్టి కనకరాజు, మానవత సంస్థ చైర్మన్ బుద్దరాజు వెంకటపతి రాజు, విశ్రాంత తెలుగు అధ్యాపకుడు కలిగొట్ల గోపాల శర్మ, త్యాగరాజ భక్త సభ నిర్వాహకులు కారుమూరి నరసింహమూర్తి (బాబు), చిన్మయి మిషన్ కోశాధికారి గ్రంధి కుమార వెంకటేశ్వర వరప్రసాద్, నున్న అంజిబాబులను సత్కరించారు. కార్యక్రమ నిర్వాహకులు అల్లు శ్రీనివాస్, విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఉపాధ్యక్షుడు ఇందుకూరి శివాజీ వర్మ, వెన్నెల శ్రీనివాస్, వబిలిశెట్టి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉండి: ప్రపంచ ఫాదర్స్‌డే వేడుకలను ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చి పురుష సమాజం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురు తండ్రులను సత్కరించారు. అనంతరం పేరిష్ డెలిగేట్ విప్పర్తి మాణిక్యాలరావు, సంఘ సీఆర్ పీ కరుణాకర్, గజేంద్ర గడ్కర్, రంపా వెంకటేష్ ఫాదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కే వినయ్‌కుమార్ మాట్లాడుతూ మంచి సమాజం తయారు కావాలంటే మంచి కుటుంబాలు ఉండాలని, ప్రతీ ఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం అబ్రహాం, పురుష సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీపీ

భీమవరం అర్బన్: యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు అన్నారు. మండలంలోని చినఅమిరంలో గత 10 రోజులుగా జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ విజయ నరసింహరాజు మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా చినఅమిరం యూత్‌ను అభినందించారు. దివంగత గొట్టుముక్కల సావిత్రమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో ప్రథమ బహుమతి రూ.30 వేలు, గొట్టుముక్కల శివరాజు ఆర్థిక సహకారంతో ద్వితీయ బహుమతి రూ.15 వేలు గెలుపొందిన జట్లకు అందించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపతిరాజు, కోమటి రవి, టోర్నమెంట్ ప్రతినిధులు క్రీడాకారులు పాల్గొన్నారు.

వృద్ధులను దూషించడం నేరం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న యోహాన్

భీమవరం: వృద్ధులను దూషించడం చట్టరీత్యా నేరమని, ముసలితనంలో తల్లిదండ్రులను చూడని పిల్లలపై ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తే, గతంలో వారికి రాసి ఇచ్చిన ఆస్తుల దస్తావేజును రద్దు చేసి, ఆ ఆస్తిని తల్లిదండ్రులకే తిరిగి అప్పగించడం జరుగుతుందని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్ (న్యూటన్) అన్నారు. ఆదివారం ప్రపంచ వృద్ధుల దూషణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సంస్థ ఆధ్వర్యంలో చిన అమిరంలో ఉన్న శ్రీ స్వామి యోగీశ్వరానంద గిరి విశ్వ శాంతి వృద్ధుల సంక్షేమ కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. రేషన్ కార్డు లేని కారణంగా వృద్ధాప్య పింఛన్ రాని వారు సంబంధిత వీఆర్వో నుంచి సర్టిఫికెట్ తీసుకుని, ఆధార్ కార్డు నకలుతో జతచేసి మండల న్యాయ సేవా సంస్థకు అందజేస్తే వృద్ధాప్య పెన్షన్ అందేలా చేస్తారన్నారు. పిల్లల నుంచి తల్లిదండ్రులు మనోవర్తి పొందవచ్చన్నారు. వృద్ధులు ఎటువంటి మానసిక ఒత్తిడి లేకుండా ప్రశాంత శేషజీవితం గడపాలని ఆకాంక్షించారు. సంస్థ నిర్వాహకులు భూపతిరాజు సత్యనారాయణ రాజు మాట్లాడుతూ 2009లో స్థాపించిన వృద్ధాశ్రమంలో ప్రస్తుతం 90 మంది వరకూ ఆశ్రయం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు న్యాయవాది వీవీ సుబ్బారావు, ప్యానల్ న్యాయవాది ఎంబీ భవాని, కె.సుబ్బరాజు, పారా లీగల్ వాలంటీర్లు వి.శ్రీలక్ష్మి, ఎస్.సత్యనారాయణ రాజు, కె.నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూలలంక బోదెకు మోక్షమెప్పుడు?



మూలలంక పొలాలకు వెళ్లే పంట బోదె పూడుకుపోయిన దృశ్యం

ఆకివీడు: మూలలంక పంట బోదెకు మోక్షం లభించడంలేదు. స్థానిక వెంకయ్య వయ్యేరు పంట కాల్వ నుంచి మూలలంక ప్రాంతానికి సాగు, తాగు నీరు తీసుకువెళ్లే కాలువ గతంలో ఆక్రమణలకు గురైంది. పంట బోదెను డ్రెయిన్‌గా మార్చివేశారు. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే ఆక్రమణల్ని తొలగించి, పంట బోదె అభివృద్ధి పనుల్ని ఆ ప్రాంత రైతులకు అప్పగించారు. ఆక్రమణలున్నంత వరకూ బోదెను రైతులు తవ్వారు. అక్కడ నుంచి రైల్వే ట్రాక్ వరకూ బాక్సు టైపు నిర్మాణంతో బోదె ఉండటంతో తవ్వకం పనులు చేపట్టలేదు. రైల్వే క్యాబిన్ రోడ్డు నుంచి దుంపగడప వరకూ పంట కాల్వను ఇటీవల తవ్వారు. స్థానిక అయిభీమవరం టర్నింగ్ వద్ద పంట కాల్వ రూటు మార్చి బెడ్‌కాంక్రీట్‌తో బాక్సుటైపు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ ప్రాంతంలో కాలువ డైవర్టవ్వడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. ఎస్‌హెచ్ దగ్గర నుంచి డబ్బా టైపు కాలువలో పూడికలు భారీగా పేరుకుపోయాయి. వ్యర్థాలతో నిండిపోయింది. కాలువపైన ఉన్న శ్లాబ్‌ను పడగొట్టి పూడికల తీయాల్సి ఉంది. దీనిలోని పూడికలు తీసిన తరువాతే మూలలంక కాల్వ ద్వారా పంట నీరు ప్రవహించే అవకాశం ఉంది. దీనిలోకి చొచ్చుకువస్తున్న ఆసుపత్రులు, కాఫీహోటళ్లు, కోళ్లఫారంల నుంచి వస్తున్న వివిధ డ్రై యిన్లు మురుగు నీటిని మళ్లించాల్సి ఉంది. లేకుంటే కాల్వ పూర్తిగా డ్రెయిన్ నీటితో ప్రవహించే అవకాశం ఉంది. దీనిపై ఎమ్మెల్యే దృష్టి పెట్టాలని మూలలంక రైతులు, దుంపగడప, ఆకివీడులోని పలు వార్డుల్లోని ప్రజలు కోరుతున్నారు. పంట కాల్వగా ఉన్న మూలలంక బోదెకు మోక్షం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అవస్థలు ఘనం.. అభివృద్ధి శూన్యం

- విస్సాకోడేరు లేఅవుట్‌లో కనీస సౌకర్యాలు కరువు
- అధ్వానంగా కాలనీలోకి వెళ్లే ప్రధాన రోడ్డు
- తాగునీటి కోసం ఎదురుచూపులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



రోడ్లు అధ్వానంగా దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మున్సిపాలిటీకి సంబధించి ఉన్న విస్సాకోడేరు హౌసింగ్ లేవుట్‌లో రోడ్లు, తాగునీటి వసతులు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో ఈలేవుట్ పూడిక చేసి రోడ్లు విభజించి 4,300 మంది లబ్ధిదారులకు సెంట్ భూమి చొప్పున ఇచ్చారు. అనంతరం ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగాయి. దాదాపు 50 కుటుంబాల వరకు లేవుట్‌లో ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. రోడ్లు నిర్మాణం చేపట్టే సమయానికి ఎన్నికలు రావడం తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లేఅవుట్ అభివృద్ధి ఆగిపోయింది.

ప్రధాన రహదారి అధ్వానం

పైపుల చెరువు రోడ్డు నుంచి లేఅవుట్‌కు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. గోతులతో, బురదతో అధ్వానంగా ఉండడంతో కాలనీ వాసులు రాకపోకలు సాగించడానికి తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే ప్రధాన రహదారి నుంచి కిలోమీటరు దూరం బురదలో కాలనీలోకి నడవాల్సిన పరిస్థితి ఉండడంతో కాలనీవాసులు నానా అవస్థలు పడుతున్నారు.

వారానికోసారి ట్యాంకర్

లేఅవుట్‌లో ఉన్నవారికి తాగునీరు సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్నారు. పైపు లైన్ వేసినప్పటికి అది ధ్వంసం కావడంతో అక్కడ ఉన్న వారికి మున్సిపాలిటి ట్యాంకర్లు ద్వారా తాగునీరు సరఫరా చేస్తుంది. అయితే వారం రోజులకు ఒకసారి మాత్రమే మంచినీటి ట్యాంకరు రావడంతో వారు దాహార్తితో విలావిలాడుతున్నారు. వర్షాకాలం లోపలికి ట్యాంకరు కూడా వెళ్లే పరిస్థితి ఉండదు.

అభివృద్ధి శూన్యం

కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తవుతున్నా విస్సాకోడేరు లేఅవుట్‌లో అభివృద్ధి శూన్యం. ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరగాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడమే తప్పా.. ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న లేఅవుట్‌లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవడం లేదు.

కలెక్టర్‌గారు.. మీరైనా స్పందించరూ

జిల్లా కేంద్రానికి సమీపాన ఉన్న విస్సాకోడేరు లేఅవుట్‌లో కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఇక్కడి పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని, కలెక్టర్‌గారు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

తాగునీటి కోసం ఇబ్బందులు



లేఅవుట్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పైపులైన్ ద్వారా మంచినీళ్లు సరఫరా లేకపోవడంతో ట్యాంకర్లు ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నారు. వారానికి ఒకసారి ట్యాంకరు రావడంతో మంచి నీళ్లు సరిపోక ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే ట్యాంకరు లోపలికి వచ్చే పరిస్థితి ఉండదు. ఆ సమయంలో మరింత ఇబ్బందులు పడాల్సిందే.

టి. రమ్యశ్రీ

రోడ్లు అధ్వానం



విస్సాకోడేరు లేఅవుట్‌లో అంతర్గత రోడ్లు, ప్రధాన రహదారి దారుణంగా ఉన్నాయి. ఇళ్లు నిర్మాణం చేసుకుంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెటీరియల్ తెచ్చుకొవడానికి వాహనాలు లోపలికిరాక చాలా ఇబ్బంది పడుతున్నాం. వెంటనే రోడ్లు, డ్రెయిన్లు నిర్మాణం చేయాలి.

– బి.రాజు